
# శరణు! శరణు!!

పంతుల జోగారావు



అనసూయమ్మకి ఏ చిన్న అలికిడయినా యిట్టే మెలకువ వచ్చేస్తుంది. ఆ తర్వాత ఒక పట్టాన నిద్ర పట్టదు. బయట శీతాకాలపు రొజ్జగాలి జాస్తిగానే ఉన్నట్టుంది. గదిలో మంచం మీద రగ్గు ముసుగేసుకుని పడుకున్నా యింకా చలి చలిగానే ఉంది.

గదిలోనో, వంటింట్లోనో- ఏదో చప్పుళ్లకి ఆవిడకి నిద్రాభంగం కలిగింది. కళ్లు బరువుగా మూతలు పడిపోతున్నాయి. ప్రయత్నం మీద కనురెప్పలు ఎత్తి పక్క మంచం వేపు చూసింది. ఆయన లేరు. అంటే ఎప్పటిలాగే నిద్ర లేచి సర్దడాలు, సవరించడాలు మొదలు పెట్టారన్నమాట. ఆ చప్పుళ్లకే ఆవిడకి మెలకువ వచ్చింది. మరి నిద్రపట్టదు. తనూ లేవాలి. తప్పదు.

ఈ భాగోతం ప్రతి నిత్యం ఉండేదే. ఊపిరి సలపనంత పనులున్నట్టు, ఉదయాన్నే నిద్ర లేచి పోతారాయన. వంటింట్లో స్టౌ వెలిగించి, చక్కా కాఫీ కాచుకుని తాగందే ఆయనకి తోచదు. కాఫీ సలసలా మరగనిచ్చి, ఆ తర్వాత గ్లాసులో పోసుకుని మరో గ్లాసులో బారెడు ఎత్తునుంచి పోసుకుంటూ చల్లార్చుకోడం ఆయన అలవాటు.

అలా చేస్తున్నప్పుడు వినిపించే శబ్దం అంటే అనసూయమ్మకి చాలా యిష్టం. ఆ చప్పుడు తనని గోముగా 'నిద్రలేవవే' అని పిలుస్తున్నట్టుంటుంది. అంతలోనే, 'పోనీలే ముసిలీ! మరి కాసేపు పడుకో' అని దయ తలుస్తున్నట్టూ ఉంటుంది. ఆయన మంచం మీంచి లేచినప్పుడే ఒక్కోసారి తనకి తెలివొచ్చేస్తూ ఉంటుంది. కాని, భర్త వంటగదిలో చేసే చప్పుళ్లు వినాలనే- మెలకువ వచ్చినా, మంచం దిగదావిడ.

కళ్లింకా మండుతున్నాయి. రోజూ కన్నా బాగా ముందే లేచినట్టున్నారాయన. టైమెంతయిందో.

చప్పుళ్లు వంటగదిలోంచి కాదు. ఇంకా కాఫీ కాచుకున్నట్టులేదు. మరేం చేస్తున్నారు చెప్మా?

అనసూయమ్మగారు మంచం దిగి, చెరిగిన కొప్పుని వేలుముడి వేసుకుంటూ ఆసక్తిగా ముందు గదిలోకి వచ్చింది.

అక్కడ...

పుస్తకాల బీరువాలోని పుస్తకాలన్నీ బయటకి తీసి, చుట్టూ గుట్టలు గుట్టలుగా పరుచుకుని కూచున్నారాయన. ఆ పుస్తకాల దొంతర్ల మధ్య కూచున్న భర్త సీతాపతి గారిని చూసి విస్తుపోయింది అనసూయమ్మ. బతుకంతా కష్టపడి సంపాదించుకున్న అపురూప ధన రాశుల మధ్య తృప్తిగా కూచున్న పరమలోభిలా కనిపించేరాయన. ఆ లోభత్వంలో నైచ్యం లేదు. హైన్యం లేదు. గొప్ప తేజో విలసితమయిన జ్ఞాన తృష్ణ కనిపిస్తోంది.

ఆ పుస్తక సంచయం అతనికెంతో ప్రీతి పాత్రం. అదే అతను సంపాదించిన ఆస్తి. ఎప్పుడూ ఏదో చదవందే ఆయనకి తోచదు. వయసుపైబడ్డాక- కళ్లకి యింత మందం అద్దాలొచ్చేయి. అయినా ఆయన దినచర్యలో మార్పులేదు. ఉదయాన్నే లేవడం. కాలకృత్యాలయేక కాసేపు జపం చేసుకుని, తర్వాత ఏదో గ్రంథం ముందేసుకుని కూచోడం... మధ్యాహ్నం భోజనాలయేక ఓ పదినిమిషాలు కాబోలు నడుం వాలుస్తారు. తర్వాత మళ్లీ ఏవో పుస్తకాలు తిరగేస్తూ కనిపిస్తారు. రాత్రి జాముపొద్దుపోయే వరకూ వాటితోటే అతనికి కాలక్షేపం.

ఆ పిపాస అనసూయమ్మ గారికీ అంటింది. కొద్దో గొప్పో చదవడం ఆవిడకీ అలవాటయింది. భర్త పుస్తక ప్రియత్వాన్ని ఆమోదించిందే కానీ ఏనాడూ విసుగునీ, చిరాకునీ ప్రదర్శించలేదు.

అయితే, ఇప్పుడు మాత్రం భర్త అలా పుస్తకాల గుట్టలమధ్య కూచోడం చూసి ఆవిడ నొచ్చుకుంది.

''అయ్యో రామ! ఇప్పుడీ దుకాణం పెట్టారేంటండీ... వాసు ఫోన్‌లో చెప్పింది గుర్తులేదూ?''

భార్య మాటలతో ఆవిడ రాకని గుర్తించి తలెత్తి చూసారు సీతాపతిగారు.

''కాసేపు పడుకోరాదూ! నీ కెందుకు నిద్రాభంగం?''

''సరే, మాట మార్చకండి. ఇప్పుడీ సర్దడాలు అవీ ఎందుకని... అన్నీ తను చూసుకుంటానన్నాడు కదా?'' భర్త పక్కన పుస్తకాలని కాస్త జరిపి, జాగా చేసుకుని చతికిలపడుతూ అంది అనసూయమ్మ.

సీతాపతిగారు కళ్లజోడుతీసి, భుజం మీది తువ్వాలుతో అద్దాలు తుడుచుకుంటూ భార్య ముఖంలోకి చూసేరు. సమాధానం కోసం ఆవిడ తన ముఖంలోకే చూస్తోంది.



నిజమే. వాసు ఫోన్‌లో పదేపదే చెప్పేడు. ''ఒక్క సామాను కూడా మీరు సర్దనవసరం లేదు. నేనొస్తాను. పేకర్స్ అండ్ మూవర్స్ వాళ్లొస్తారు. అన్నీ చక్కగా పేక్ చేస్తారు. మీరనవసరంగా హైరానా పడకండి... మళ్లీ ఆయాసం అదీ వొస్తే కష్టం. ఏదీ ముట్టకోకండి... అన్నీ మేం చూసుకుంటాం...'' ఇదీ ఫోన్‌లో వాసు చెప్పిన దాని సారాంశం. ఈ మాటలే పదేపదే చెప్పాడు. ఫోన్ చేసినప్పుడల్లా యివే మాటలు చెప్తూ వస్తున్నాడు. తనీవయసులో కష్టపడిపోవడం వాడికి నచ్చదు! సీతాపతిగారి ముఖంలో చిరు మందహాసం తొణికిసలాడింది. ఆ నవ్వులో ఒక సంశయం. ఒక అపనమ్మకం– అనసూయమ్మగారు పోల్చుకున్నారు.

భర్తకి మొదటి నుంచీ యీ ప్రయాణం యిష్టం లేదు. సంవత్సరాల నుండీ ఉంటున్న ఈ యింటినీ, పరిసరాలనీ విడిచిపెట్టి సంసారాన్నంతా ఎత్తిపెట్టుకుని వాసు దగ్గరికి, ఆ మహానగరానికి మకాం మార్చడం అతనికి సమ్మతం కాదు. కాని తప్పలేదు. కొన్ని అనివార్యతలు కొన్ని ఆకాంక్షలని అదిమిపెట్టి, తమ ఆధిక్యతని చాటుకుంటాయి మరి!

సీతాపతిగారు కాసేపు మౌనంగా ఉండి, తర్వాత అన్నారు: ''నిజమే అనసూయా... వాడసలు నన్ను ఏ సామానూ సర్దొద్దని హెచ్చరించేడు....''

''అవును కదా... మరిప్పుడీ పుస్తకాల బీరువా అంతా ఖాళీ చేసారేం?'' భర్త చేతిని నిమురుతూ అడిగింది అనసూయమ్మ.

''ఇవి... ఈ పుస్తకాలు... ఈ పుస్తకాలు సామాను కాదుకదా అనసూయా!''

భర్త గొంతులోంచి తడితడిగా వచ్చిన ఒక్కో మాటా– ఒక జలదరింపుకి గురిచేసాయి అనసూయమ్మగారిని.

ఆవిడ యింకేం మాట్లాడుతుంది?

***

వీధిలో ఆటో ఆగిన శబ్దం విని, చేతిలో పని వదిలేసి ఒక్క ఉదుటున వీధి గుమ్మంలో కొచ్చింది అనసూయమ్మ.

ఒక చిన్న జర్నీబేగ్ చేతపుచ్చుకుని ఆటో దిగాడు వాసు. ఆ వెనకనే శ్రీలత. అనసూయమ్మగారి సంతోషానికి అవధులు లేకపోయింది. కొడుకు వస్తూ తన కూడా కూతుర్ని వెంట బెట్టుకుని రావడం చూసి ఆవిడ ఆనందంతో తబ్బిబ్బయిపోయింది.

తెల్లపూల చుడీదార్ వేసుకుని, మెడలో ఒంటిపేట గొలుసు, చేతికి రిస్టువాచీతో మనవరాలు నవ్వుతూ తన వేపే చూస్తోంది.

''నాన్నమ్మా'' అంటూ ప్రేమగా పలకరించింది. ఆ గొంతులోని మాధుర్యం అనసూయమ్మగారిని పులకరింప చేసింది. మనవరాలి చేతిని ప్రేమగా అందుకుని 'రారా అబ్బాయ్... కోడల్ని కూడా తీసుకుని రావల్సింది' అని కొడుకుతో అంటూ యింట్లోకి దారితీసింది.

కొడుకు రాక గమనించి చేతిలో పుస్తకాలని పక్కన పెట్టి 'వచ్చేవా వాసూ!' అని పలకరించేరు సీతాపతిగారు. పక్కనే శ్రీలతని చూసి చాలా సంతోషించేరు.

'కోడలు రాలేదా...' తండ్రి మాటలు మధ్యలోనే తుంచేస్తూ ''ఇప్పుడు తనెందుకు రావడం నాన్నా... దుమ్ము ధూళీ పీల్చడానికి కాకపోతే! అసలే తనకి డస్ట్ అలర్జీ... ఇదిగో, దీన్ని కూడా రావద్దనే చెప్పాను. వినలేదు. మళ్ళీ మళ్ళీ తాతగారి ఊరు చూస్తానో చూడనో అని శతపోరి నావెంట పడింది... చేప్తే వినిపించుకునే రకం అయితే కదా''

తండ్రి మాటతీరు తనకి అలవాటే అన్నట్టుగా ఆ మాటల్ని ఖాతరు చేయలేదు శ్రీలత. మురిపెంగా వచ్చి, తాతగారి పక్కన పుస్తకాల దొంతర్ల మధ్య కూచుండి పోయింది.

''అరెరే!... డర్టీ డర్టీ... బట్టలు పాడవుతాయి చూసుకోవద్దూ...' అని కూతుర్ని గాబరాగా హెచ్చరిస్తూ అప్పుడు గమనించేడు వాసు–

తండ్రి పుస్తకాల గుట్టల మధ్య ఉద్దండంలా ఉన్నాడని. వడలిన శరీరంతో– దుమ్మపట్టిన బైండు పుస్తకంలా కనిపించేడతని కళ్లకి.

తండ్రి తీరుకి ముందు చిరాకు, అసహనం కలిగేయి. అది కోపంగా మారి తండ్రిమీద రుసరుసలాడి పోయేడు.

''ఏంటి నాన్నా... ఏంటిదంతా... మిమ్మల్నేవీ ముట్టుకోవద్దన్నానా! పేకర్స్ వాళొచ్చి, వాళ్లే అన్నీ చూసుకుంటారు... మీ కళాఖండాలేవీ పాడైపోవు లెండి... యింతోటి ఖజానా ఎవరూ దోచుకుపోరు లెండి... అసలెవరిక్కావాలి యివన్నీ...''

కొడుకు మాటలు విని నిస్సహాయంగా ఎదురు చెప్పలేక నిరుత్తరులై ఉండిపోయేరు సీతాపతిగారు. శ్రీలత తండ్రినీ తాతగారినీ మార్చి మార్చి చూస్తోంది. ఆపిల్లకి తండ్రినుద్దేశించి ఏదో చెప్పాలనిపించింది. ఏం చెప్పాలో పాలుపోలేదు.


వచ్చిన వాళ్లకి కాఫీ పెడదామని వంటింట్లోకి వెళ్లిన అనసూయమ్మగారికి తండ్రీ కొడుకుల మధ్య పుస్తకాల విషయమై ఏదో పెద్ద రగడే మొదలయేలా తోచింది. వాసు తండ్రితో అంత కటువుగా ఎలా మాట్లాడగలిగేడో ఆవిడకి అర్థం కాలేదు. వీడు చిన్నప్పటి నుంచీ అంతే! తనేమిటో, తన బాగేమిటో చూసుకోవడం తప్ప ఎవరి మనసు ఎలా గాయపడుతుందనే చింతేలేదు.

ఇప్పుడయినా, లోకభీతికి జడిసి, తప్పని సరై తమని పట్నం తీసికెళ్తున్నాడేమో! అక్కడ వీడికి మంచి కంపెనీలో పెద్ద హోదాలో పని. బాగా సంపాదిస్తున్నాడు. పెద్ద యిల్లు. కావలసినంత వసతి. ఎవరి గదులు వాళ్లవి. ఒకరితో ఒకరికి సంబంధం అక్కరలేదు. తనూ భర్తా ఓ మూల–గదిలో పడున్నా పట్టనట్టుగా ప్రవర్తించగలడు. ఈ ఆలోచన వచ్చేక ఆవిడ మనసు ఓసారి కలుక్కుమంది.

వాసు తమని తన దగ్గరికి తీసికెళ్తున్నాడా!... నిజంగా తమని దగ్గరిగా, సన్నిహితంగా చేర్చుకోగలడా! చిన్నప్పటి ఆటవస్తువు పెద్దయక మళ్లీ యిప్పుడు దొరుకుతుందా!

కాఫీ కలుపుతునే భర్త ఏం చెబుతారా అని చెవులు రిక్కించి విందావిడ.

కాస్సేపు మౌనం వహించేక: ''లేదురా...ఇవీ... ఈ పుస్తకాలన్నీ ఓ క్రమంలో దొంతర్లు పెడుతున్నాను. తీరా పని వాళ్లొచ్చేక అయితే కష్టం కదా– అదీ కాక, వాళ్లు వీటిని చిందర వందరగా పేకింగ్ చేస్తే యిబ్బందనీ...''



''గాడిద గుడ్డేం కాదూ- మేం చూసుకుంటాం- మీరు వెళ్లి పడుకోండి'' ఇలా అనగలగడం కోసం ఎంత లేసి పెద్ద చదువులు చదివేడో! ఎంత పెద్ద ఉద్యోగం వెలగబెడుతున్నాడో!

ఆ ముసలి దంపతుల కళ్లలో చెమ్మ మిగిలి ఉంటే ఓ రెండు చుక్కలయినా రాలి ఉండేవి- అను కుంది శ్రీలత; అక్కడ యిబ్బందిగా అనిపించి, వంటింట్లో నాన్నమ్మ పక్కకి చేరింది.

***

పది కాకుండా పేకర్స్ అండ్ మూవర్స్ వాళ్లొచ్చేరు. పేకింగ్ మెటీరియల్ చాలా తెచ్చేరు. వీధిలో లారీ నిలిచి ఉంది. వెంటనే పని ప్రారంభించేరు.

ఏయే సామాన్లు ఎలా సర్దాలో వాసు దగ్గరుండి పురమాయిస్తున్నాడు. అతను చెప్పినట్టే సర్ది చక్కగా అట్టపెట్టెల్లో పేక్ చేస్తున్నారు ఆ వచ్చిన వాళ్లు.

సీతాపతిగారి మనసు తహతహలాడి పోతోంది. పుస్తకాలు పేకింగ్ చేసినప్పుడయినా తను దగ్గర ఉంటే బాగుండును. కోపంలో దూర్వాసుడ్ని మించి పోయేడు వాసు! దగ్గరకి రానిచ్చేలా లేడు. మంచం మీద అసహనంగా దొర్లుతున్నారు. అతని అవస్థ గమనించి 'మరేం ఫరవాలేదు... అన్నీ సవ్యంగానే జరుగుతాయి' అని భరోసా యిస్తున్నట్టుగా కళ్లతోటే అనునయించింది అనసూయమ్మగారు.

సామాన్లు సర్దుతూ ఉంటే- శ్రీలత కూడా తండ్రి పక్కనే ఉండి అన్నీ చూసుకుంటోంది.

పేకర్స్ మనుషులు తమ వెంట తెచ్చున్న పెట్టెల్లో వాసు చెప్పున్న సామాన్లని జాగ్రత్తగా సర్దుతూ పేకింగ్‌రోప్‌తో మిషన్ మీద గట్టిగా పది లంగా బిగిస్తున్నారు. తండ్రి సూచనల మేరకు శ్రీలత ఆ అట్టపెట్టెల మీద 'కిచెన్ గూడ్స్' 'టీవీ' 'వాషింగ్ మెషిన్' ఇలా వాటి వివరాలు క్లుప్తంగా మార్కింగ్‌పెన్‌తో రాస్తోంది. ఒక్కోబాక్స్‌కీ ఒక్కోనెంబరు రాస్తోంది.

మరో గంటకి దాదాపు యింటెడు సామానూ పేకింగ్ చెయ్యడం పూర్తయింది.

మంచంలో పడుకుని సీతాపతిగారూ, వంట గది ద్వారం పక్కన కుర్చీలో కూలబడి అనసూయమ్మగారూ జరుగుతున్న తతంగాన్ని గమనిస్తున్నారు.

తమ ప్రమేయం లేకుండానే-

కొన్ని పదుల సంవత్సరాలు తమ చేతుల్లో తడిమిన ఒక్కో వస్తువూ అట్టపెట్టెల్లో ఖైదీల్లా ఒదిగిపోవడం వారికి చోద్యంగానూ, రవ్వంత విషాదంగానూ తోస్తోంది.

తప్పదు... ఇవాళో రేపో జరిగి తీరాల్సినదే...అనుభవం అందించిన పెద్దరికంతో దుఃఖాన్ని దిగమింగుకున్నారిద్దరూ. కొడుకింట్లో కడతేరే వరకూ ఒక పిడికెడు గౌరవం, ఆదరణలు లభిస్తే... అదే చాలు! ఇద్దరి మనసు పొరల్లో మెదులుతున్న ఆలోచన యిదే.

కొడుకు తీరు తొలినుంచీ తెలిసిందే. ఒక మంచీ ఒక చెడ్డా లేదు. పెద్దా చిన్నాలేదు. ఒట్టి కోపిష్టి మనిషి. ఇక కోడలు... చెప్పుకోడానికేం లేదు. పెళ్లయినప్పటి నుంచీ తమతో నోరువిప్పి మాట్లాడడమే గగనం. ఆ యింట్లో ఈ వయసులో తాము యిమడగలరా! ఇద్దర్నీ బయటకి చెప్పుకోలేని విధంగా వేధిస్తున్న ప్రశ్నలివి... అందుకే తమతో వచ్చెయ్యమని వాసు లోగడ ఎన్ని సార్లడిగినా సున్నితంగా దాటవేసారు. మరిప్పుడు తప్పింది కాదు.

ఈ కారు చీకటిలో కాంతి రేఖ ఏదయినా ఉందంటే- ఒక్క మనవరాలు...శ్రీలత! ఏమో! అది కూడా ఆగూటి చిలుక అయిపోదు కదా!

సామాన్ల పేకింగు దాదాపు పూర్తయింది.

ఇక పుస్తకాల వంతు వచ్చింది.

సామాన్లు పేకింగు చేయించేటప్పుడు వాసు వాటిని రెండురకాలుగా విభజించేడు. పనికొచ్చేవీ. పనికిరానివీ.

పనికిరావనుకున్న వాటిని కూడా పేక్ చేయించి, శ్రీలత చేత వివరాలు నమోదుచేయించి ఆ పెట్టెలకీ నంబర్లు నోట్ చేయించేడు.




# శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానము

## కదిరి - అనంతపురం జిల్లా

" ప్రహ్లాదసమేతుడై ఖాద్రీక్షేత్రమున వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించి తరించండి"

**నిత్య అన్నదాన పతకము " అన్నిదానములలోకెల్ల అన్నదానము మిన్న "**

ప్రయాగలో లక్షమందికి కానీ, కాశీ మహాక్షేత్రములో రెండు రెండు లక్షల మందికి గాని, పవిత్ర గంగానది ఒడ్డున ఏడు లక్షల మందికి గాని, అన్నదానము చేస్తే ఎంతపుణ్యమో శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రములో ఒక్కరికి అన్నదానము చేస్తే అంతటి పుణ్యాన్ని కలిగిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. వందలాది మైళ్ళ దూరం నుండి అలసి, సొలసి వచ్చే తోటి భక్తులను అన్నదానంతో సంతృప్తి పరచండి. తరతరాలు నిరంతరం జరిగే నిత్యాన్నదాన పథకంలో రూ.2016/-లు ఆపైన చెల్లించిన మీరు, మీ వంశపారంపర్యం ఆచంద్రార్కం పుణ్యాన్ని సంతరించుకుంటారు. ఉదార స్వభావులైన భక్తులు రూ.2016/-లు ఆపైన విరాళము చెల్లించి అన్నదాన పథకము నిర్విఘ్నముగా జరుగుటకు సహాయసహకారములందించి శ్రీ వారి అనుగ్రహం పొందగలరని మనవి చేయడమైనది.

**బస్సు సౌకర్యము :**
కదిరి పట్టణము, అనంతపురం (జిల్లా) నుండి 85కి.మీ. కడప నుండి 150కి.మీ., గుంతకల్లు 170కి.మీ. తిరుపతి నుండి 210కి.మీ, బెంగుళూరు నుండి 200కి.మీ. దూరములో ఉన్నది.
సమీప రైల్వేస్టేషన్ : ధర్మవరం 65 కి.మీ.,
సమీప విమానాశ్రయము : పుట్టపర్తి 45కి.మీ.,

**నిత్యపూజా వివరాలు :**
1. శ్రీవారి కళ్యాణోత్సవము : 2500/-
2. స్వర్ణ కవచ సేవ : 75/-
3. అభిషేకము : 110/- (ఇద్దరికి మాత్రమే)
4. అర్చన (అష్టోత్తరము) : 5/-
5. టెంకాయ, హారతి: 5/-
6. కేశఖండన : 10/-
7. నివేదన రుసుము : 15/-
8. ఉయ్యాలోత్సవము : 150/-
9. వాహనపూజా : 50/-
10. వాహనపూజ (ద్విచక్ర) : 25/-
11. నామకరణం : 116/-
12. చెవులకుట్లు : 20/-
13. అన్నప్రాసన : 51/-
14. వెండి రథప్రాకారోత్సవం : 516/-
15. ఉపనయనం : 300/-
16. తులభారం : 116/-

**శాశ్వత పూజ పథకముల వివరములు :**
17. శాశ్వత అభిషేక పూజ : 2116/-
18. శాశ్వత అన్నదానపథకం : 2016/-
19. శాశ్వత అష్టోత్తరనామార్చన : 1116/- (శ్రీవారికి)
20. శాశ్వత అష్టోత్తరనామార్చన : 1116/- (అమ్మవారికి)
21. శాశ్వత ప్రసాద వినియోగం : 1016/-



యస్. ప్రతాప్‌రెడ్డి
చైర్మెన్ మరియు ధర్మకర్తల మండలి.

**శ్రీస్వామి వారికి సమర్పించు విరాళములు :**
డి.డి./యం.ఓ.ద్వారా ఈ క్రింద అడ్రస్సునకు పంపవచ్చును. కార్యనిర్వాహణాధికారి
శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానము, కదిరి - 51591
అనంతపురం జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఫోన్ : 08494 - 21066.

బి.యల్.వి. ప్రసాద్ రావు.
బి.ఎ.,
సహాయ కమిషనరు మరియు కార్యనిర్వాహణాధికారి.



పట్నం తీసెకెళ్లే సామాన్లలో వాటికి స్థానం లేదు. అలాంటి పెట్టెలు అయిదారయ్యేయి. వాటిని సొంతిల్లే కనుక- యింట్లో పనివాళ్ల చేత అటక మీద పెట్టిస్తున్నాడు. వాటిని తమతో తీసికెళ్లే ప్రసక్తే లేదు.

పుస్తకాల సంగతీ అంతే-

చదువుకునే రోజుల్లోనూ, తరవాత చాలా వెచ్చించి తన కెరీర్‌కి పనికొచ్చే పుస్తకాలు కొన్నాడు. కాంపిటేటివ్ పరీక్షలకి పనికొచ్చే పుస్తకాలు చాలా ఉన్నాయి. అవి కాక వ్యక్తిత్వ వికాస గ్రంథాలూ, శబ్ద కోశాలూ ఉన్నాయి. చవకబారు నవలలూ కొద్ది పాటి ఉన్నాయి. అవన్నీ వాసు కొన్నవే. ఆ పుస్తకాలన్నీ కలిపి ఒక బాక్స్‌లో పేక్ చేయించేడు. మిగిలిన పుస్తకాలన్నీ ఒక బాక్స్‌లో సర్దించాడు. అవి తండ్రి చదివే పుస్తకాలు. పాత చింతకాయ పచ్చళ్ళు.

పుస్తకాలు సర్దడం మొదలయిన దగ్గర నుంచీ సీతాపతి స్థిమితంగా మంచం మీద పడుకోలేదు. లేస్తున్నారు. కూచుంటున్నారు. వాసుకి ఏదో చెప్దామని తటపటాయిస్తున్నారు. ధైర్యం చాలడం లేదు. తనకెంతో ప్రీతిపాత్రమయిన పుస్తకాలు. భారత భాగవతాలు... ప్రబంధ, శతక సాహిత్యాలు... వాటితోపాటు తొలితరం ఆధునిక రచయితల కలాల నుండి జాలువారిన అపురూప సాహిత్యం... గద్యం...పద్యం...గేయం... కవిత్రయం నుండి కరుణశ్రీ వరకూ...ఎన్నెన్నో మంచి పుస్తకాలు... తనెంతగానో యిష్టపడే నవలా సాహిత్యం... కథా సంపుటాలు... ఒకటా రెండా! చెప్పుకుంటే చేంతాడంత. వాసు దృష్టిలో యిదంతా పనికిమాలిన చెత్త. వీటి వల్ల ఎర్ర ఏగానీ సంపాదించలేం. సమాజంలో ఒక ఉన్నత స్థానం పొందలేం.

అవీయివీ అనకుండా దొరికిన అన్ని మంచిపుస్తకాలూ చదవడం సీతాపతిగారి అలవాటు. ప్రాచీనం- ఆధునికం అన్న తేడాయే లేదు. అన్ని వేపుల నుంచీ ప్రసరించే అన్ని పవనాల సుగంధాలనీ ఆస్వాదించేరు. అవకాశం ఉన్నంతమేరకు, శక్తి కొద్దీ వాటిని సేకరించారు.

అలా పోగయిన పుస్తక సంచయమే అది!

వాటిని వాసు యిప్పుడేం చేయబోతున్నాడు?

ఒక కలవరపాటు సీతాపతిగారిని కుదిపేస్తోంది.

ఒక చేతగాని తనం క్రుంగదీస్తోంది.

సమాధాన పడడమనేదే కదా, వార్ధక్యం నేర్పించే తొలి చేదు పాఠం!

***

అనుకున్నంతా అయింది!

సీతాపతిగారికి ప్రియమయిన పుస్తకాలున్న అట్టపెట్టె అటకెక్కింది. ఇల్లు అమ్మకం జరిపినపుడు తేవొచ్చని- వాసు అన్నప్పుడు ఆ తండ్రి హృదయం చెక్కలై చెమ్మగిల్లింది.

అది జరిగే పని కాదని తెలిసిపోతూనే ఉంది. చివరకి అటకమీద ఆ పుస్తకాల గతి చెదలుపట్టి చిరిగిపోవడమే అని అర్థమయేసరికి- సీతాపతిగారిలో అంతవరకూ మిణుకుమన్న చివరి ఆశాలేశం కూడా అణగిరిపోయింది. ఇదంతా చూస్తున్న అనసూయమ్మగారు కూడా ఏమీ మాట్లాడలేకపోయేరు.

అసమర్థతలో ఎంత విషాదం గూడు కట్టుకుని ఉంటుందో జీవితంలో తొలిసారిగా అనుభవించేరు సీతాపతిగారు.

ఒక గుండె గొంతుకలో కొచ్చి నీరసంగా కొట్టుకుంది.

పనివాళ్లు సామాన్ల పెట్టెలు లారీలోకి ఎక్కించడం మొదటపెట్టారు. వాసు దృష్టిలో పనికిరాని వస్తువులున్న పెట్టెల్ని అటకమీద సర్దేరు. పని పూర్తయింది. లారీ బయలు దేరింది.

***

పట్నం వచ్చి వారం గడిచింది.

ఆ పెద్ద యింట్లో తల్లికీ తండ్రికీ ఓ మూల గది కేటాయించేడు వాసు. వచ్చిన తొలినాళ్లలో ఓసారో, రెండుసార్లో తప్ప మరింక ఆ ఛాయలకి రావడం లేదు వాసు. కోడలు సరేసరి. వేళకి తిండీ తిప్పలు అమిరిపోతున్నాయి. మందులకీ, మాకులకీ కొదవ లేదు. పనివాడు తెచ్చిపెడుతున్నాడు. గదిలో రెండు ఫేన్లు, ఓ చిన్న టీవీ ఉంది. వేసం కాలం వచ్చేక ఏసి పెట్టిస్తాట్ట....

అంతా బాగానే ఉంది.

అంతా బాగానే ఉందా?

అసలు తమకి ఊపిరాడుతోందో లేదో! ఆ దంపతులకి, వారి స్థితి వారికే అగమ్యగోచరంగా ఉంది.

సామాన్లు సర్దించేటప్పుడు- కావాలనే వాసు కొన్ని అట్టపెట్టెలను తెరిపించ లేదు. అవసరం లేదనుకున్న వాటిని అలాగే ఉంచేడు. పుస్తకాలపెట్టెని సీతాపతిగారి రూంలో పెట్టించాడు. తీరిగ్గా దాన్ని ఓపెన్‌చేసి కావలసిన వాటిని ఉపయోగించుకోమని శ్రీలతకి చెప్పేడు. అవన్నీ ఆమె కెరీర్‌కి బాగా దోహదం చేస్తాయని హెచ్చరించేడు.

సీతాపతిగారికీ, అనసూయమ్మగారికీ రోజులు నిస్సారంగా గడుస్తున్నాయి.

***

ఆ సాయంత్రం....

మంచం మీద పక్కనే కూచుని 'తాతయ్యా!' అని శ్రీలత పిలుస్తూ ఉంటే, కళ్లు తెరిచి చూసేరు సీతాపతిగారు.

తర్వాత చాలా సేపు తాతా, నాయనమ్మలతో ఆ కబుర్లూ యీ కబుర్లూ చెప్పింది. చాలా రోజుల తర్వాత ప్రాణం లేచొచ్చినట్టయింది వారికి.


ఉన్నటుండి ఏదో గుర్తొచ్చినట్టు అడిగింది శ్రీలత: ''తాతాగారూ! మొన్నా మధ్య మా కేలేజీలో తెలుగుభాషా సంఘం వాళ్లు వచ్చి ఏదో కార్యక్రమం చేసారండీ... కొంత అర్థం అయింది. కొంత కాలేదు. మన భాషని మనం కాపాడుకోవాలిట. లేకపోతే అది చచ్చిపోయే రోజు ఎంతో దూరంలో లేదుట... నాకేం అర్థం కాలేదు... తెలుగు చచ్చిపోవడమేమిటండీ? మనందరం మాట్లాడుతూనే ఉన్నాం కదా!'' ఆ మాటల్లో అమాయకత్వం చూసి నవ్వొచ్చింది సీతాపతిగారికి...

మనవరాలిని మరింత దగ్గరకి తీసుకుని ఆదరంగా అన్నారు: ''శ్రీ! నీకు తెలుగు ధారాళంగా మాట్లాడడం వచ్చు...ఒప్పుకుంటాను... మరి తెలుగు పుస్తకాలు చదవనూ, తెలుగులో రాయడం కూడా వచ్చునా మరి?''

తాతగారి ప్రశ్నకి తెల్లబోయింది శ్రీలత. ఆ తాతా మనవరాళ్ల మాటల్ని ఆసక్తిగా గమనిస్తోంది అనసూయమ్మ.

''రాదుకదా! అదేమరి... తెలుగు భాష చచ్చిపోవడమంటే...'' శ్రీలత నిర్ఘాంత పోయింది, ఆ మాటలతో.

తప్పెవరిదో, యీ స్థితికి కారకులెవరో ఆపిల్లకి వెంటనే స్ఫురించలేదు. అయోమయంగా చూసింది.



''మరెలా?'' బేలగా అడిగింది.

ఆమెలోని అలజడిని గుర్తిస్తున్నట్టుగా, ఓదార్పుగా అన్నారు సీతాపతిగారు: ''ఈ తరం పిల్లలు తెలుగులోని మంచి మంచి పుస్తకాలని చదవడం చేయాలమ్మా... మాట్లాడ్డమే కాదు... చదవడం రాయడం చేయాలి... తెలుగు భాషా సాహిత్యాల మీద మక్కువ పెంచుకోవాలి... ఏమయినా చులకన భావం, అనాదరణ ఉంటే వాటిని విడిచిపెట్టాలి... మన ఉనికినీ, మన భాష ఉనికినీ కాపాడుకోవాలంటే ఇదే మన తక్షణ కర్తవ్యం...'' ఉపన్యాస ధోరణిలో సాగాయి ఆయన మాటలు.

అప్పుడు తటాలున గుర్తొచ్చింది, శ్రీలతకి- తనా గదిలోకి వచ్చిన పని!

తాతగారి మంచం పక్కన పేర్చి ఉన్న అట్టపెట్టెల్లో ఒకదాని నంబరు సరి చూసుకుని, దాన్ని యివతలకు లాగింది. వెంట తెచ్చుకున్న కత్తెరతో పేకింగ్‌రోప్‌ని తెంచి పెట్టె తెరిచింది.

సీతాపతిగారి కళ్లు మిలమిలామెరిసాయి.

''ఇదెలా సాధ్యమయిందమ్మా....'' అతని గొంతులో ఉద్విగ్నత.

''నంబరు మేజిక్కు తాతగారూ! మార్కింగ్ పెన్నుతో అంకెల్ని మార్చడం కష్టం కాదుకదా! ఒకటిని నాలుగుగా, మూడుని, ఎనిమిదిగా...యిలా! పాపం, పూర్ డాడీ కనిపెట్టలేక పోయేరు!'' అంది నవ్వి.

''తప్పు కదమ్మా...'' లాలనగా అడిగాడు తాతగారు.

''నాటెటాల్! టిట్‌ఫర్ టాట్... మీ నిధి మీ కొచ్చింది... నిస్సంకోచంగా స్వీకరించండి తాత గారూ! మా డాడీ మమ్మీలు ఈ గది ఛాయలకి వచ్చేదే లేదు... వచ్చినా, మునిగిపోయేదేం లేదు'' ఆ పిల్ల మాటల్లో ఒక విసురు! ఒక పెంకెతనం... ఎంతయినా యీ తరానికి ప్రతినిధి కదా!!

''మంచిదమ్మా... నా నిధిని నాకిచ్చేవు... మరి దీన్ని భద్రపరుచుకోవలసిందీ, ఉపయోగించ వలసిందీ మీ తరమే సుమా!'' శ్రీలత తల ప్రేమగా నిమురుతూ అన్నారు సీతాపతిగారు.

*

## నేను మళ్ళీ నాన్నవుతాను!



ర్యాంకుల కోసం రంకెలు
వేయడం
మాని
నీ అంకెల్లో అల్లుకుంటాను!
బూటులేసులు సరిగా లేవని
అలగడం మాని
నీ పాదాల్ని ఇసుక రేసులో పరుగులు తీయిస్తాను!
బ్యాగ్ భారం తగ్గించి
నీ కలల్ని కాగితం పడవల మీద కెక్కిస్తాను
చెంచాతో తినలేని నిన్ను గేలిచెయ్యడంమాని
గోరు ముద్దలు తినిపిస్తూ గగన సీమలో చందమామని
చూపిస్తాను!
ఆంగ్లం కోసం అగ్గి రాముడవడం మాని
వేమన వెలుగులు చూపిస్తాను!
నీ లేత చేతులు నన్ను చుట్టుకున్నప్పుడు
'నువ్వింకా పిల్లాడివే' అని గుర్తుంచుకుంటాను!
పెద్ద ఆశలు గుమ్మరించే ముందు
నీలోకి 'పరకాయ్రపవేశం' చేస్తాను
నీ కోసం
మళ్ళీ నాన్నవుతాను.

– రచన : వీరేశ్వరరావు.ఎమ్